ప్రముఖుల జీవితాలలో గొప్ప సంఘటనలు 67

# సమయ స్ఫూర్తి

అది ఇంగ్లాండు దేశం.

ఒక భారతీయుడు సాయంత్రంపూట వాహ్యాళికి వెళ్తున్నాడు. ఆయన మన తెలుగువారి లాగా పంచ, కుర్తా ధరించాడు. మనిషి పచ్చని పసిమి, నల్లని గడ్డం, నుదుటి మీద ఎర్రని కుంకుమబొట్టు, తలకి తెల్లని పాగా... వీటిని చూస్తే ఎవరో 'మంత్రవేత్త' అనిపిస్తున్నాడు.

ఆయనకి ఎదుటివైపునుంచి పదిమంది మంచి బలిష్ఠులైన ఆంగ్లేయులు తప్ప త్రాగి వస్తున్నారు.

వాళ్ళు ఈ మనిషిని చూడగానే, "కొట్టండి... తన్నండి!" అంటూ వెంట పడ్డారు. వాళ్ళని చూసి భయపడి ఆయన పరుగెత్తసాగారు.

పరుగెత్తి పరుగెత్తి ఆయనకు అలసట వచ్చి ఆగిపోయాడు.

వెంటనే ఆయనకి ఒక చక్కని ఆలోచన వచ్చింది. తన చుట్టూ రాయితో ఒక గిరి గీసుకున్నాడు, దాంట్లో నిలబడి, "హ్రాం, హ్రీం..!" అంటూ ఆకాశం వంక చూస్తూ ఏవో మంత్రాలు చదవసాగాడు.

వెంటనే ఆ గిరి మధ్య హాయిగా కూర్చుని, వాళ్ళవంక చూస్తూ "మీలో ఎవరికైనా ధైర్యం ఉంటే, గిరిదాటి లోనికి రండి" అని సవాలు చేశాడు.

గిరి దాటి వెళ్తే ఏమి ప్రమాదం వస్తుందోనని, వాళ్ళ కాళ్లు వణకసాగాయి. ధైర్యం చేసి ఎవరూ వెళ్లలేకపోయారు.

వాళ్ళ పరిస్థితి చూసి, ఆయన గిరి మధ్యలో పద్మాసనం వేసుకుని మరింత హాయిగా కూర్చుని, చిరునవ్వుతో, వాళ్ళని దగ్గరకు రమ్మని మరింత కవ్వించసాగాడు.



ఆయన నిబ్బరం చూస్తుంటే, ఇంకా అక్కడే ఉంటే ఆ మంత్రవేత్త తమను ఏమి చేస్తాడోనని, ఆ గుంపు పారిపోయింది.

వాళ్ళు వెళ్లిపోయాక, జరిగిన దానికి నవ్వుకుంటూ, ఇంటికి వెళ్లిపోయాడు ఆయన. మంత్రశక్తిని మించిన సమయస్ఫూర్తితో గండం తప్పించుకున్నది. ఎవరో తెలుసా? ఆయనే... దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు.

★★★

# తలవంచని న్యాయమూర్తి

అది భారత దేశాన్ని బ్రిటిష్‌వారు పరిపాలిస్తున్న రోజులు.

అప్పుడు భారత దేశానికి వైస్రాయిగా 'లార్డ్ లిన్‌లిత్ గో' వుండేవారు. ఆయన మాటకు తిరుగుండేదికాదు.

దేశంలో కొన్ని సంస్కరణలని ప్రవేశపెట్టాలని అప్పటి సుప్రీంకోర్టు న్యాయమూర్తిని సంప్రదించారు.